TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 239 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.26.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

# రాష్ట్రంలో గ్యాస్, పెట్రోల్‌కు కొరత లేదు



హైదరాబాద్ అమృత్ తెలంగాణ:రాష్ట్రంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలు, వదంతులతో ఆందోళన చెందొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం శాసనమండలిలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలపై సమీక్షించారు. రోజువారీగా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయొద్దని వాహనదారులకు సూచించారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదాదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు రెగ్యులర్‌గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతో రోజు వారి డిమాండ్ ఒక్కసారిగా 25శాతం పెరిగిందని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. పెరిగిన డిమాండ్ రోజువారీ సగటున పోల్చిచూసినపుడు కుడా ఎక్కడా అంతరాయం కలుగకుండా అదనంగా 22 శాతం నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే కొన్ని పెట్రోలు బంక్‌లకు నిర్ణిత సమయానికి ట్యంకర్లు చెరుకోకపోవడంతో ఆయా బంక్‌ల్లో నో-స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇందన నిల్వలు రానున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయనీ, సరఫరాలో అంతరాయం ఉండదని వివరించారు. కొరత ఉందనే పుకార్లను సాకుగా చేసుకుని బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను భట్టి ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జనార్, సుధీర్ బాబు, ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బకాయిలు అడిగితే అరెస్టులా?




హైదరాబాద్ అమృత్ తెలంగాణ: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన బకాయిల గురించి అడిగితే అరెస్టులు చేస్తారా? ప్రజాపాలన అంటే ఇదేనా? అని విద్యార్థి లోకం ఆగ్రహం వ్యక్తం చేసింది. బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ఇదే అంశంపై భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నిర్వహించిన చలో అసెంబ్లీ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వంపై విద్యార్థుల ఆగ్రహాన్ని వెల్లడించింది. ఎన్నికలకు ముందు విద్యా రంగానికి కనీసం 15శాతం కేటాయిస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని పేర్కొంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడించేందుకు విద్యార్థులు పరుగెత్తుకొచ్చారు. వివిధ మార్గాల్లో పోలీసులను తప్పించుకుంటూ అసెంబ్లీ సమీపంలోకి వచ్చిన వారిని పోలీసులు బలవంతంగా అడ్డుకుని అరెస్ట్ చేశారు.

ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఒక్కసారిగా పోలీసులు విద్యార్థుల చుట్టుముట్టడంతో వారంతా అక్కడే రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు వారిని మరింత బలవంతంగా లాక్కెళ్లి వాహనాల్లోకి ఎక్కించారు. అరెస్టయిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. మమత, డి. కిరణ్, కె.అశోక్ రెడ్డి, కె. ప్రశాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. వై.ప్రణయ్, ఆకారపు నరేష్, కార్తీక్, లెనిన్, లవకుమార్, పట్ల మధు, జ్యోతిబసు, నవ్య, జ్ఞాప్నిక, శ్రీకాంత్, తరంగ్, రాజేష్, రాహుల్, నందు తదితర రాష్ట్ర నాయకులున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీ కాంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోగా ఉద్యమాలపై అణచివేత ధోరణితో ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ, రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 20శాతం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాల్లో సుమారు 70 శాతం అద్దె భవనాల్లో నడుస్తున్నాయని తెలిపారు. వాటితో పాటు అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీ లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

రాష్ట్రంలో ఏకపక్షంగా నూతన జాతీయ విద్యా విధానం -2020 అమలు చేస్తామని ప్రకటించడాన్ని రజనీకాంత్ ఖండించారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ, అది అమలు కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ , నాన్-టీచింగ్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వసతి గృహ విద్యార్థులకు ఇవ్వాల్సిన మెస్‌చార్జీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "బెస్ట్ అవైలబుల్ స్కీం" కింద ఉన్న రూ. 218 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.




## కార్మికులు ఆత్మహత్యల బాట పట్టకుండా ఆర్థిక వెసులుబాటు కల్పించాలి



రాజన్న సిరిసిల్ల : అమృత్ తెలంగాణ: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని కోరుతూ మాజీ మంత్రి, బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు బుధవారం ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ను, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పవర్‌లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిల భారంపై ఆయనకు సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రిని కలిసి ఒక లేఖను అందజేశారు.

సిరిసిల్ల పట్టణం రాష్ట్ర వస్త్ర పరిశ్రమకు గుండెకాయ వంటిదని, గతంలో ఇక్కడ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన చేదు జ్ఞాపకాలను కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పి. వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల పరిశ్రమ నిలదొక్కుకుందని, అయితే ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న 'బ్యాక్ బిల్లింగ్' భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆయన వివరించారు.

రూ. 38 కోట్ల విద్యుత్ భారం రద్దు చేయాలి

2016 నుండి 2024 వరకు ఉన్న కాలానికి సంబంధించి సుమారు 127 ఎస్.ఎస్.ఐ (SSI) యూనిట్లపై అధికారులు రూ. 19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ భారం మోపారని, అది సర్‌చార్జిలతో కలిపి ఇప్పుడు రూ. 38 కోట్లకు చేరిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భారీ బకాయిలను చెల్లించలేక అనేక యూనిట్లు మూతపడటంతో పాటు, ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల భారాన్ని మానవీయ కోణంలో రద్దు చేసి నేతన్నను అదుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, కార్మికుల ఉపాధిని రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరారు.

# షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అమృత్ తెలంగాణ మంచిర్యాల న్యూస్ మార్చి 25, 2026: జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి సబ్-కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఎ.సి.పి.లు ప్రకాష్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి పోలీస్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు, ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులు, పరిష్కారం, బాధితులకు న్యాయం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ఎస్.సి., ఎస్.టి. సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్. సి., ఎస్. టి. అభివృద్ధి, కేసులు, ఎన్ ఫోర్స్ మెంటు అమలు అంశాలపై తీసుకుంటున్న చర్యలపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎస్.సి., ఎస్.టి. లకు ప్రాధాన్యతహొహొఇవ్వడం జరుగుతుందని, ఇండ్లు నిర్మించుకోలేని వారికి గుత్తేదారుల సమన్వయంతో ఇల్లు నిర్మించి ఇచ్చేలా చర్యలుహొహొతీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రగతికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. దండేపల్లిలోని పి వి టి జి, తాండూర్ లో ఎస్.టి. వసతి గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకులాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో అందరికీ అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు శాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు కార్యచరణ ప్రకారంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో తప్పుడు కేసులు నమోదు చేసిన వాటి వివరాలను స్పష్టంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసులలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదులో వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2023 డిసెంబర్ వరకు నమోదైన కేసులలో బాధితులకు గత సంవత్సరం 1 కోటి 34 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం నిర్వహణలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పౌర హక్కుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా చేపట్టాలని, జిల్లాలో క్రయ విక్రయాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యమైన విద్య బోధన అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. పారిశుధ్యం, త్రాగునీరు ఇతర ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

డి.సి.పి. మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల నియంత్రణపై ఎస్. సి., ఎస్. టి. లకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను గ్రామపంచాయతీలలో నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరికి హక్కులపై అవగాహన కలుగుతుందని తెలిపారు. 2025 సంవత్సరములో 117 అట్రాసిటీ కేసులు నమోదు అయ్యాయని, కేసుల పరిష్కారంలో సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, సరైన ఆధారాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, బెక్కం రాజారావు, దుర్గం ఎల్లయ్య, పెద్ది రాజన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, ఎ.టి.డి.ఓ. సురేష్, కలెక్టరేట్ బి విభాగం పర్యవేక్షకులు మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా 'మహిళా మార్ట్' ప్రారంభం:జిల్లా కలెక్టర్ రాజర్షిషా






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మహిళా సాధికారత దిశగా అదిలాబాద్ జిల్లా మరో ముందడుగు వేసిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా మహిళా సమాఖ్య, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన అదిలాబాద్ మహిళా మార్ట్' ప్రారంభోత్సవానికి మునిసిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మహిళా సంఘాలు తయారు చేస్తున్న సుమారు 30 రకాలకు పైగా నాణ్యమైన ఉత్పత్తులు ఈ మార్ట్‌లో లభ్యమవుతాయని తెలిపారు. పట్టణ నడిబొడ్డున, ప్రధాన రహదారి పక్కనే ఈ మార్ట్‌ను ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన వస్తువులు నేరుగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆదివాసీలు తయారు చేసే ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులకు, అటవీ ఉత్పత్తులకు ఇక్కడ ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. 'మేడ్ ఇన్ అదిలాబాద్ – ఫర్ అదిలాబాద్' అనే నినాదంతో ప్రారంభమైన ఈ మార్ట్, భవిష్యత్తులో హైదరాబాద్‌లోని ఐఎంఎస్ బజార్ తరహాలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాల ద్వారా తయారైన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ వినూత్న విక్రయ కేంద్రాన్ని అందుబాటులోకి తెలిపారు. కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించడం గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓరవీందర్, వార్డ్ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, మహిళా సమైఖ్య సభ్యులు లక్ష్మి, బృందన, మంజుల, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన కొరతకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులు, పెట్రోల్ బంక్ డీలర్లతో నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇంధన కొరత తలెత్తకుండా నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులు అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకునే పరిస్థితి రాకుండా అవగాహన కల్పించడంతో పాటు, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. చమురు సంస్థల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ జిల్లాకు అవసరమైన ఇంధన కోటాను సకాలంలో తెప్పించుకోవాలని డీలర్లకు సూచించారు. జిల్లాలో ఎక్కడా 'స్టాక్ లేదు' అనే బోర్డులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని, అత్యవసర సేవల వాహనాలకు ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ఎలాంటి సమస్యలు లేదా సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800 4251939ను సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ జూమ్ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నందిని,తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, చమురు సంస్థలప్రతినిధులు,పెట్రోల్ బంక్ డీలర్లు, పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అధికారులు

# ఇంద్రవెల్లి ఏకలవ్య మోడల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా





కూరగాయలను పరిశీలిస్తున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇంద్రవెల్లి మండలంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, విద్యార్థుల హాజరు పట్టిక, భోజన మెనూ ఆయన పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వసతి గృహంలో పలువురు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న భోజన నాణ్యతను, వసతి గృహంలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇంగ్లీష్ భాషా, సబ్జెక్టుపై నైపుణ్యం పెంచుకోవాలని సూచించి, వారిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పారిశుధ్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల ఆవరణ లోని వాకింగ్ మరమ్మతులు చేపట్టి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంతకుముందు పాఠశాలలోని వంట గది, సరుకు నిల్వల గది, భోజన శాల, వసతి గృహాలను పరిశీలించారు. పాఠశాల లో అవసరమైన స్పోర్ట్స్ షూస్, గ్రిజర్స్, ఇతర సౌకర్యాలు, వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలి ప్రిన్సిపాల్ ను ఆదేశించారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రేఖ రాణి, డిఈ శివ ప్రసాద్, పిఈటి సరిత, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి రాజీనామా




జగిత్యాల అమృత్ తెలంగాణ మార్చి 25: మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి జగిత్యాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో తన రాజీనామా ప్రకటించారు. ఎంతమంది కాంగ్రెస్ నేతలు బుజ్జగించినా వెనక్కి తగ్గకుండా రాజీనామా,పార్టీతో నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రయాణానికి స్వస్తి, పార్టీలో ఇమడలేక, విధిలేని పరిస్థితుల్లో రాజీనామా చేస్తున్నట్టుగా భావోద్వేగ ప్రకటన. అయితే సమావేశం ముగిసిన తరువాత బీఆర్ఎస్ పార్టీ నుండి కేటిఆర్, హరీష్ రావు ఇంటికి వెళ్లి కలిసి నట్టు సమాచారం.భవిష్యత్ ఎటో వేచి చూడాలి.

# ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల శతాబ్ది వేడుకలు..

## కుబీర్ గ్రామంలో హిందూ సమ్మేళన నిర్వహాక కమిటీ కోసం సమావేశం:....



నిర్మల్ జిల్లా కుబీర్ మార్చ్ 25 అమృత్ తెలంగాణ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఈ రోజు సాయంత్రం ఐదు గంటలకు కుబీర్ గ్రామంలోని శ్రీ విట్టలేశ్వర మందిరం నందు మండల స్థాయిలో హిందూ ధర్మం కోసం, హిందూ యువతలో చైతన్యం కోసం ఇట్టి సమావేశాన్ని ఏర్పాటు చేసి""""హిందూ సమ్మేళన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించి పూర్తి స్థాయిలో వచ్చే శనివారం రోజున మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ జిల్లా కార్యకారిని సదస్సులు, జిల్లా గ్రామ వికాస ప్రముఖ్ నాగమణి లింగన్న మరియు కుబీర్ మండలంలోని పరిసర గ్రామల యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# దంతన్‌పల్లి పి.హెచ్.సి లో స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా





అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్ నుండి వచ్చిన ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తాల్మాలజీ వంటి ఆరు రకాల స్పెషలిస్ట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు, రక్తహీనత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వీటి నివారణకు ప్రజలు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. ఆర్.ఎం.పిల వద్దకు వెళ్లి అనవసరంగా యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అర్హులైన వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని వివరించారు. రక్తహీనత సమస్య ఉన్నవారు ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ టాబ్లెట్లను క్రమం తప్పకుండా వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

అంతకుముందు ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించే పలు సూచనలు చేశారు.

అనంతరం దంతన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడుతూ, పనుల్లో వేగం పెంచి వర్షాకాలానికి ముందే నిర్మాణాలు పూర్తి చేసెల ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇసుక కొరత, బిల్లుల చెల్లింపులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహసిల్దార్ రఘునాథ్, ఎంపీడీవో రామ్ ప్రసాద్, సర్పంచ్ అంకవ్వ, ఉప సర్పంచ్ మోబిన్, వైద్య సిబ్బంది, ఏఈ లు దివ్య, వంశీ, లబ్ధిదారులు, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# చెంచులకు ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

అచ్చంపేట :అమృత్ తెలంగాణ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలు, చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడారు. నల్లమల్ల ప్రాంతం అచ్చంపేట నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతం ఏజెన్సీ ప్రాంతంలోని చెంచులు సొంతంగా ఇండ్లు నిర్మించుకోలేరు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అచ్చంపేట నియోజకవర్గం లో ఎన్నికల హామీలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు ను తెలంగాణ ప్రజా ప్రభుత్వం 3500 ఇండ్లను కేటాయించారు నియోజకవర్గ ప్రజల తరపున ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొంతమంది అసంపూర్ణంగా ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం త్వరగా ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని సభలో గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభ్యర్థించారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.ఇందిరమ్మ ఇల్లు బేస్ మెంట్ వరకు నిర్మించుకున్న వారికి డబ్బులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వనపర్తిలో హజ్ యాత్రికుల టీకాలు ప్రారంభం


వనపర్తి అమృత్ తెలంగాణవనపర్తి జిల్లా కేంద్రంలో హత్యయాత్రికల కోసం టీకాల కార్యక్రమం ప్రారంభమైందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్ రెడ్డి తెలిపారు. 2026--వనపర్తి జిల్లా డ్రగ్ స్టోర్‌లో ఈరోజు హజ్ యాత్రికుల టీకామరియు వైద్య పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికంగా ప్రారంభించింది.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డిఎంహెచ్ ఓ ) డాక్టర్ సాయినాథ్ రెడ్డి మరియు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ( డి ఐ ఓ) డాక్టర్ పరిమళ ఈ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో మొత్తం 33 మంది హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన టీకాలను వేశారు.

# జీవన్ రెడ్డి అంటే ఒక బ్రాండ్.

## అధ్యక్షా...! 'ఏదైతే ఉందో'' అనే ప్రత్యేక స్టైల్.

## జీవన్ రెడ్డి మాటే సపరేటు. ఇట్టే ఆకట్టుకునే మాట తీరు.

### ప్రత్యేక స్టోరీ.



జగిత్యాల అమృత్ తెలంగాణ మార్చి 25: తెలంగాణ అసెంబ్లీ హాల్లో ఒక్కసారిగా నిశ్శబ్దం నెలకొంటుంది. స్పీకర్ వైపు చూసి, మైక్ దగ్గరికి వాలి... "అధ్యక్షా... ఏదైతే ఉందో..." అని మొదలు పెడతారు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎమ్మెల్యే టి. జీవన్ రెడ్డి. ఆ ఒక్క మాటే సరిపోతుంది.. అందరి దృష్టి ఆయనపై కేంద్రీకృతమవుతుంది.

ఇది కేవలం ఓ మాట కాదు... జీవన్ రెడ్డి రాజకీయ వ్యక్తిత్వానికి గుర్తింపు. ఆయన ప్రసంగంలో ప్రతి అంశం మొదలయ్యే ముందు వినిపించే ఈ 'ఏదైతే ఉందో...' అన్న ఊతపదం, ఇప్పుడు అసెంబ్లీలోనే కాదు, రాజకీయ వర్గాల్లో కూడా హాట్ టాపిక్‌గా మారింది.

రాజీనామా తర్వాత మరింత హైలైట్,ఇవాళ జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేయడంతో.. ఆయన పేరు మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో కేంద్రబిందువుగా మారింది. ఈ పరిణామం తర్వాత ఆయన గత ప్రసంగాలు, ముఖ్యంగా "ఏదైతే ఉందో..." అనే క్యాచీ వర్డ్ మరింతగా చర్చకు వచ్చింది. ఒక విధంగా చూస్తే.. ఆయన మాటల వెనుక ఉన్న స్పష్టత, స్వతంత్ర ధోరణి ఈ నిర్ణయంలో కూడా ప్రతిఫలించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మాటకు ముందు నమ్మకం... మాట తర్వాత నమ్మకం

జీవన్ రెడ్డి మాట్లాడే ప్రతి అంశం వెనుక పక్కా ఆధారాలు, స్పష్టమైన సమాచారమే ఉంటాయి. "ఏదైతే ఉందో..." అని మొదలు పెట్టడం ద్వారా.. తాను చెప్పబోయేది నిజం, దానికి సాక్ష్యం ఉంది అనే సందేశాన్ని ముందుగానే ఇస్తారు. అది ఆయన స్టైల్ మాత్రమే కాదు, ఒక విధంగా ఆయన రాజకీయ ధోరణి కూడా.

అనుభవం మాట్లాడే విధానం

దాదాపు 40 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో జీవన్ రెడ్డి ఎన్నో వేదికలు చూశారు. సభలలో, మీడియా సమావేశాలలో, ముఖ్యంగా అసెంబ్లీలో.. ఎక్కడ మాట్లాడినా ఒకే తీరు. అప్రయత్నంగా, ఆత్మవిశ్వాసంతో, వినిపించే శైలి. అందుకే ఆయన మాటలు వినడానికి ప్రత్యర్థులు కూడా ఆసక్తి చూపిస్తారు.

క్యాచీ వర్డ్... క్లాస్ మార్క్‌గా

ఇప్పటికే చాలామంది నాయకులకు ఒక ప్రత్యేకమైన శైలి ఉంటుంది. కానీ జీవన్ రెడ్డి విషయంలో అది ఒక స్థాయికి వెళ్లింది. "ఏదైతే ఉందో..." అన్న మాట ఇప్పుడు ఆయనకు సొంతమైన బ్రాండ్‌లా మారింది. అసెంబ్లీలో ఆయన మాట్లాడకముందే... "ఇప్పుడు వస్తుంది ఆ మాట" అని ఎదురు చూసే స్థితి వచ్చింది.

గమ్మత్తు... గంభీరత కలయిక

ఈ క్యాచీ వర్డ్‌లో ఒక గమ్మత్తు ఉంది... అదే సమయంలో గంభీరత కూడా ఉంది. వినడానికి సింపుల్‌గా అనిపించినా.. అది ఒక రాజకీయ కమ్యూనికేషన్ టెక్నిక్. మాట మొదలు పెట్టే ముందు ప్రేక్షకుల దృష్టిని తనవైపు తిప్పుకునే తెలివైన పద్ధతి.

మీమ్స్ నుంచి మెయిన్ స్ట్రీమ్ వరకు

సోషల్ మీడియాలో కూడా ఈ పదం వైరల్ అయింది. మీమ్స్, షార్ట్ వీడియోలు, రాజకీయ చర్చలు---ఎక్కడ చూసినా "ఏదైతే ఉందో..." వినిపిస్తోంది. కానీ ఆ వినోదం వెనుక ఒక సీనియర్ నాయకుడి కమ్యూనికేషన్ శైలి దాగి ఉందనే విషయం గుర్తించాలి.

చివరగా...

రాజకీయాల్లో మాటే ఆయుధం. ఆ మాటను ఎలా వినిపించాలి, ఎలా నమ్మించాలి అన్నది నాయకుడి ప్రతిభ. జీవన్ రెడ్డి విషయంలో.. "ఏదైతే ఉందో..." అనే చిన్న పదమే ఆయన పెద్ద గుర్తింపుగా మారింది. ఇప్పుడు... రాజీనామా తర్వాత ఆయన రాజకీయ ప్రస్థానం ఎటు తిరుగుతుందో అనేది ఆసక్తిగా మారింది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టమే.. అధ్యక్షా... ఏదైతే ఉందో... ఇదే ఆయన స్టైల్... ఇదే ఆయన సిగ్నేచర్!

# పెట్రోల్,డీజిల్ తో పాటు కొరత లేదు

## రాష్ట్రంలో సరిపడా ఇంధన నిలువలు

## ఏ ఒక్కరూ గందరగోళంలో పడకండి

## వదంతులతో ఆందోళన చెందకండి

## -రాష్ట్ర ప్రజలకు మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధ

అమృత్ తెలంగాణ హైదరాబాద్ న్యూస్ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్,ఎల్.పి.జి కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తేలేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రధానంగా హైదరాబాద్ లో డీజిల్,పెట్రోల్ బంక్ ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూలను చూసి పెట్రోల్,డీజిల్,ఎల్.పి.జి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ఇంధన వనరులతో పాటు ఎల్.పి.జి కొరత అంటూ వస్తున్న వదంతులతో ప్రజాలేవరు గందరగోళంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు.

ఈ మేరకు రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలసి ఆయన మీడియాతో ముచ్చటించారు.

రానున్న మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని జరుగుతున్న వదంతులతో ఏ ఒక్కరూ అయోమయంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్,భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయని ఆయన పేర్కొన్నారు.

డిమాండ్ నీ మించి సరఫరా కొనసాగుతోందని,ఈ రోజు 17,246 కిలో లీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.అంటే 652 కిలో లీటర్ల అదనపు నిల్వ మిగిలిందన్నారు.

దీనికి తోడు అదనంగా 16,000 కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతో పాటు 1200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు.

వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతొ రోజు వారి డిమాండ్ ఒక్కసారిగా 25% పెరిగినా రోజువారీ సరఫరాలో సగటున పోల్చిచూసినపుడు కుడా ఎక్కడా అంతరాయం కలుగ కుండా అదనంగా 22% అందుబాటులో ఇంధన వనరులు నిల్వలు ఉన్నాయని ఆయన తెలిపారు.

అయితే కొన్ని పెట్రోలు బంక్ లకు నిర్ణిత సమయానికి ట్యంకర్లు చెరుకోక పోవడంతో ఆయా బంక్ లలో నో-స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు.వాస్తవంగా మాత్రం ఎంత మాత్రం కొరత లేదని ఆయన పునరుద్ఘాటించారు.

అయితే అదే సమయంలో షికార్లు చేస్తున్న పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో,డబ్బాలలో పెట్రోల్, డీజిల్ ని తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని అంతకుమించి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.

పెట్రోలియం నిలువలు రానున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయని,సరఫరాలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేలా నిరంతరం కొనసాగేందుకు వీలుగా రా.+.జ లైన్ ను విస్తరించినట్లు ఆయన వెల్లడించారు.

రాష్ట్ర రాజధానిలో 596 పెట్రోల్ బంక్ లు నిరంతరాయంగా పని చేస్తున్నాయని,హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలో ఎక్కడ కుడా కొరత లేదని,అహ్మదాబాద్, సూరత్,బెంగుళూరు,ధారవాడ ,బెల్గాం వంటి నగరాలలో కూడ ఇదే పరిస్థితి ఉత్పన్నమయ్యాయన్నారు.

ఎల్.పి.జి విషయంలో ఎటువంటి కొరత లేదని,కాకపోతే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంతమేర సమస్య ఉన్నట్లు గుర్తించమన్నారు.

ఇదే సందర్భంలో అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

పెట్రోల్,డీజిల్ గృహ వినియోగదారులకు అవసరమైన ఎల్.పి.జి సమృద్ధిగా అందుబాటులో ఉందని,ప్రజలేవరు అయోమయానికి గురి కావొద్దని,వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రాబందు రేవంత్ పాలనలో పిట్టల్లా రాలుతున్న రైతులు

## ఆర్థిక ఇబ్బందులు తాళలేక చెప్పి మరీ ఆత్మహత్య చేసుకున్న రైతన్న..!



అమృత్ తెలంగాణ తలమడుగు న్యూస్

తలమడుగు మండల కన్వీనర్ తోట వెంకటేష్

ఒకవైపు పండిన పంటను కొనుగోలు చేయక..

మరోవైపు రైతుబంధు ఇవ్వక

రైతులకు దెబ్బ మీద దెబ్బ కొడుతున్న రైతు ద్రోహి రేవంత్!

అకాల వర్షాలతో పంట దిగుబడి రాక,

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోకపోగా

రైతుబంధు కూడా ఇవ్వక పోవడంతో

సాగు భారమై, ఆర్థిక ఇబ్బందులు తాళలేక

ఇటీవల ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో

ఆదిలాబాద్ రూరల్ మండలం అర్లి (బి)కి చెందిన రైతు తుడుం గణపతి తన ఆవేదనను వెళ్లగక్కిండు.. ఆ వీడియో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది.

తాను ఆవేదన చెందుతూ చెప్పినట్టే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మరణించిన ఘటన చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నది.

నీ మోసపు పాలనతో ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటావ్ రేవంతూ అని ఈ ఈరోజు తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో నిర్వాహించిన మీడియా సమావేశం మాట్లాడుతూ రైతుమీద ప్రేమ పాలనా మీద చిత్తశుద్ధి లేని ఈ ప్రభుత్వం కనీసం రైతులకీ రైతు బందు కూడా సరిగా ఇవ్వడం చేతగావడం లేదు అని అన్నారు

ఆ నాడు కెసిఆర్ గారు ముఖ్యమంత్రి ఉన్నపుడు కరోనా లాంటి కష్ట కాలంలో కూడా రైతు లకు రైతు బందు అందించారు అని అన్నారు.! ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి కిరణ్ కుమార్. యువ నాయకుల అభిరామ్ రెడ్డి. తలమడుగు సర్పంచ్ చంటి. సర్పంచ్ అశోక్. మహేష్ దేశముఖ. రవికాంత్ యాదవ్ మాజీ సర్పంచ్ రాజేశ్వర్. తలమడుగు ఉప సర్పంచ్. రమాకాంత్. మల్లేష్. కార్తీక్ రెడ్డి. రాగి కిషన్. పోచన్న. మండలం దీ=హా పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానూలు పాల్గొన్నారు.

# చెట్ల నరికివేత పై ఎంపీడీవో ఎంక్వయిరీ......



నరికి వేయబడ్డ చెట్ల ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నిర్మల్ జిల్లా: దిలావర్పూర్ మండలంలోని కంజర్ మార్చ్ 25 అమృత్ తెలంగాణ కంజర్ గ్రామంలో హరితహారంలో నాటిన చెట్లను అడుగు భాగం నుండి నరికివేసి అమ్ముకొని సొమ్ము చేసుకున్న వ్యక్తులపైన చర్యలు తీసుకోవలసినదిగా వినతి పత్రం అందజేసిన దానికి స్పందించిన ఎంపీడీవో దిలావర్పూర్ మండలంలోని కంజర్ గ్రామంయందు తెలంగాణ ప్రభుత్వం ద్వారా హరితహారంలో భాగంగా అధికారులు గత కొన్ని సం.లుగా

(1).బన్సపల్లి గ్రామము నుండి కంజర్ గ్రామము మధ్యన గల బీటీ రోడ్ నకు ఇరువైపుల

(2).కంజర్ గ్రామము నుండి మల్లాపూర్ గ్రామము నకు మధ్యన గల బీటీ రోడ్డునకు ఇరువైపుల

వివిధ రకాల చెట్లను నాటి వాటిని సంరక్షించడం జరిగినది. కానీ గత పది రోజుల నుండి గుర్తు

తెలియని కొంతమంది వ్యక్తులు చెట్లను అడుగు భాగం నుండి నరికివేసి, చెట్ల దుంగలను

అక్రమంగా లారి రిజిస్ట్రేషన్ నంబర్. ఇూ23ఎ 6904 ద్వారా దాదాపుగా 4 ట్రిప్పులుగా తరలించి

వాటిని అమ్మి సొమ్ము చేసుకోవడం జరిగింది.

పత్రాలుకూడావీరివద్దన లేవు,,ఫిర్యాదు చేయడంతో బుధవారం ఎంపీడీవో చెట్ల నరికివేతను పరిశీలించి అక్రమంగా చెట్లనునరికితరలించినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు

# మార్కెట్‌లో తప్పిపోయిన బాలుడు

## సురక్షితంగా తల్లికి అప్పజెప్పిన మహిళా పోలీసులు (నారిశక్తి)



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన మహిళా పోలీసులను ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్

ప్రతీ బుధవారం నారిశక్తి లో భాగంగా ఈరోజు నర్సాపూర్ (జి) ప్రాంతంలో విధుల్లో ఉన్న మహిళ పోలీసులు (నారిశక్తి), మధ్యాహ్నం సుమారు 1:30 గంటల సమయంలో నర్సాపూర్ (జి) మార్కెట్ ప్రాంతంలో 4 సంవత్సరాల బాలుడు ఏడుస్తూ కనిపించడాన్ని గమనించారు. వెంటనే ఆ బాలుణ్ణి సంప్రదించి వివరాలు అడిగి తెలుసుకోగా, తన తల్లి కనిపించడం లేదని తెలిపాడు. అప్పుడు ఆ పిల్లవాడు మాది గొల్లపేట్, నిర్మల్ అని తెలియ జేశాడు.దీంతో,నారిశక్తి మార్కెట్ ప్రాంతమంతా బాలుడి తల్లిని వెతికినా ఆచూకీ దొరకలేదు.అనంతరం ఆ బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, అతనికి ఆహారం అందించారు.తరువాత ఆ పిల్లవాడు,పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడని తెలుసుకున్న తల్లి అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు బాలుడిని సురక్షితంగా తల్లికి అప్పగించారు. ఈ ఘటనలో అప్రమత్తంగా స్పందించి, తప్పిపోయిన బాలుడిని సురక్షితంగా గుర్తించి తల్లికి అప్పగించిన మహిళా పోలీసులు షహన బాను, వినితలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ హృదయపూర్వకంగా అభినందించారు. విధి నిర్వహణలో చూపిన అప్రమత్తత, మానవత్వంతో వ్యవహరించిన తీరు, తక్షణ స్పందన వంటి లక్షణాలు పోలీస్ విభాగానికి గౌరవాన్ని తీసుకువస్తాయని పేర్కొన్నారు.

# జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి లుచ్చా నాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఆర్ టి సి యూనియన్.



అమృత్ తెలంగాణ- బోథ్ మహబూబాబాద్ జిల్లా మార్చి 24 న్యూస్ జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చా నాయక్ చిత్రపటానికి నివాళులర్పించిన ఆర్టిసి ఎస్టీ యూనియన్ ఎంప్లాయిస్ సంఘం నాయకులు. మూడు రమేష్ నాయక్, సీతారామరాజు,సీతారాం నాయక్, ఎల్ ఎస్ కుమార్ తదితరులు ఈరోజు హుస్సేన్ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యం ఇచ్చిన ఆర్ టి సి ఎస్ టి యూనియన్ ఎంప్లాయిస్ నాయకులు

# మతం మారితే కులం మారుతుందా డా గురువింద పల్లి ప్రవీణ్ కుమార్ నందిగామ జి డి ఎం ఎం కాలేజి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్

అమృత్ తెలంగాణ– బోథ్ మతం మారితే కులం మారుతుందారాజ్యాంగం ముందుంచిన ప్రశ్నపై సమాజం అంతా కలిసి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని జి డి ఎం ఎం కాలేజి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డా గురవిందపల్లి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు నందిగామలో ఆయన మీడియా తో మాట్లాడుతూభారతదేశంలో రిజర్వేషన్ వ్యవస్థ ఒక సాధారణ సంక్షేమ విధానం కాదు అది శతాబ్దాలుగా కొనసాగిన సామాజిక అసమానతలను తగ్గించడానికి రాజ్యాంగం రూపొందించిన ఒక ముఖ్యమైన సామాజిక న్యాయ యంత్రాంగమన్నారు అందువల్ల కులం మతం రిజర్వేషన్ల మధ్య ఉన్న సంబంధం వంటి అంశాలు భావోద్వేగాలతో కాకుండా రాజ్యాంగ సూత్రాలు చట్టపరమైన వాస్తవాలు సామాజిక పరిశీలనల ఆధారంగా చర్చించబడాలని డిమాండ్ చేశారు ఇటీవలి కాలంలో మతం మారిన షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ అంశం దేశవ్యాప్తంగా మళ్లీ చర్చకు వస్తోందన్నారు ఈ నేపథ్యంలో ఒక ముఖ్యమైన ప్రశ్న సమాజం ముందుకొస్తోంది మతం మారితే కులం కూడా మారిపోతుందా అని ప్రశ్నించారు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం షెడ్యూల్డ్ కులాల జాబితాను రాష్ట్రపతి నిర్ణయిస్తారు అలాగే 1950 ప్రెసిడెంటిల్ ఆర్డర్ ప్రకారం ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాల హోదా హిందూ సిక్కు బౌద్ధ మతాలకు మాత్రమే వర్తిస్తుందన్నారు అందువల్ల ఒక వ్యక్తి హిందూ మతంలో ఉన్నప్పుడు షెడ్యూల్డ్ కులంగా పరిగణించబడినా, క్రైస్తవ లేదా ఇతర మతంలోకి మారినప్పుడు ఆ హోదా చట్టపరంగా కొనసాగదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అలాంటి వర్గాలు సాధారణంగా బిసి–సి కేటగిరీలో పరిగణించ బడుతున్నాయన్నారు అయితే సమాజం ముందున్న ప్రశ్న అంతటితో ముగియదన్నారు పలు కమిషన్లు సామాజిక అధ్యయనాలు సూచించినట్లుగా మతం మారిన వెంటనే పూర్వ సామాజిక నిర్మాణాలు పూర్తిగా అదృశ్యమవుతాయని చెప్పడం కష్టమన్నారు. ముఖ్యంగా రంగనాథ మిశ్రా కమిషన్ (2007) నివేదికలో మత మార్పిడి జరిగినప్పటికీ పూర్వ కులాల ఆధారంగా ఏర్పడిన సామాజిక పరిస్థితులు అనేక ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని సూచించబడింది భారత సుప్రీంకోర్టు కూడా కొన్ని సందర్భాల్లో కులం పుట్టుక ఆధారంగా ఏర్పడే సామాజిక గుర్తింపు అనే భావనను ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని ఒక వర్గం లేదా ఒక మతానికి పరిమితం చేయకుండా సమాజం మొత్తం కలిసి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు క్రైస్తవులు క్రైస్తవేతరులు మేధావులు విద్యార్థులు



సామాజిక కార్యకర్తలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న బాధ్యతాయుత వ్యక్తులు అందరూ కలిసి ఈ అంశంపై సమగ్రంగా చర్చించాలని కోరారు ఈ చర్చలో పరస్పర గౌరవం వాస్తవాలపై ఆధారపడిన విశ్లేషణ రాజ్యాంగ విలువల పట్ల నిబద్ధత ఉండాలని కోరారు రిజర్వేషన్ వ్యవస్థను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా సామాజిక న్యాయం సమాన అవకాశాలు మరియు చారిత్రక అన్యాయాల పరిహారం అనే దృక్పథంతో చూడాలని సూచించారు మతం కులం మరియు రిజర్వేషన్ల మధ్య ఉన్న సంబంధం సంక్లిష్టమైనదైనా ఈ ప్రశ్నకు సమాధానం సమాజంలో విభేదాలను పెంచే విధంగా కాకుండా అవగాహనను పెంచే విధంగా రావాలని కోరారు అందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసి వాస్తవాలు చట్టం మరియు సామాజిక న్యాయం అనే మూడు ప్రమాణాల ఆధారంగా నిర్మాణాత్మక చర్చను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు అదే భారత రాజ్యాంగం మనకు నేర్పిన ప్రజాస్వామ్య మార్గమన్నారు

# ఉద్యాన నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

## సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ -ఉట్నూరు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



అమృత్ తెలంగాణ మంచిర్యాల న్యూస్ మార్చి 25, 2026: సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ– ఉట్నూరు పరిధిలోని ఉద్యాన నర్సరీల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ –ఉట్నూరు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల 100 ఎకరాల తోటను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉద్యాన నర్సరీల బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని రాజంపేట లో ఉద్యాన నర్సరీలను అధికారులు ఆకస్మికంగా సందర్శించాలని తెలిపారు. ఈ సంవత్సరం ఆగ్రో ఫారెస్ట్రీ, నేషనల్ బ్యాంబు (వెదురు) మిషన్ లో భాగంగా 2 కోట్ల రూపాయల నిధులతో నర్సరీలలో మొక్కల పెంపకంతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

రైతులకు అవసరమైన మొక్కలను నాణ్యత ప్రమాణాలు పాటించి తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతామని, మామిడి, వెదురుతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, అలంకరణ మొక్కలు పెంచడానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేయాలని వినతి...

భువనగిరి :అమృత్ తెలంగాణ: మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి, 45 రోజులు గడిచాయని వెంటనే మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ బి ఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ఆయా వార్డుల సమస్యలు కౌన్సిల్కు తెలియజేసి, వాటి పరిష్కారానికి మార్గం చూడవలసి ఉన్నందున వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని, భువనగిరి పట్టణంలో ఉన్నటువంటి మహిళ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా అందుతున్న రుణాలను కొంతమంది బ్యాంకు ఉద్యోగులు, మెప్మా అధికారులు, ఆర్పీలు దుర్వినియోగం చేసిన దానిపై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏ వి కిరణ్ కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కౌన్సిలర్ లు చెన్న స్వాతి మహేష్, నాకోటి నగేష్, చీమల రాజు యాదవ్, ఏలే భువనేశ్వరి శివ, తాడూరు బిక్షపతి, తాడెం రాజశేఖర్, నువ్వుల సుధాకర్, సుభాష్, సైదులు, మధు లు పాల్గొన్నారు.



# నాన్ బెయిలేబుల్ వారెంట్లను తగ్గించిన పోలీస్ కమీషనర్

కంఠేశ్వర్ :అమృత్ తెలంగాణ: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్, ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలోని అన్నీ పోలీస్ స్టేషన్ లలో గత చాలా రోజుల నుండి పెండింగ్‌లో ఉన్న నాన్–బెయిలబుల్ వారెంట్ల (ఎన్ బి డబ్ల్యూ) సంఖ్యను తగ్గించడానికి నిజామాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇటీవల కొన్ని కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి అని నిజామాబాదు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య తెలియజేయడం జరిగింది. మార్చ్ 20 నుండి మార్చ్ 24 వరకు పోలీస్ కమీషనరేట్ పరిధిలో నాన్– బెయిలబుల్ కేసుల విషయం లో ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్వహించడం జరిగింది.

పెండింగ్ లో గల వారెంట్ల అమలు

కోర్టులు జారీ చేసిన వారెంట్లను త్వరితగతిన అమలు చేయాలని , ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న నిందితులను పట్టుకోవాలని పోలీస్ కమిషనర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేకబృందాలు

82 , 83 ప్రోసిడింగ్ ప్రకారంగా నేరస్థులకు సంబంధించిన స్థిర ఆస్తులు మరియు చర ఆస్తులను జప్తు చేసుకొనే అవకాశం గలదు. కొద్దిమంది బ్రతుకు తెరువు నిమిత్తము గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారిపై ఉన్న నాన్–బెయిలబుల్ వారెంట్, కు సంబంధించినటువంటి కేసులలో 03 లుక్ అవుట్ సర్కులర్ జారీ చేయడం జరిగింది. ఎన్.బి.డబ్ల్యు లను తగ్గించడానికి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి , ఈ నాలుగు రోజులలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాన్–బెయిలబుల్ వారెంట్లు మొత్తం 105 కేసులను పరిష్కారం చేయడం జరిగింది


# చీర కట్టులో సిగ్గు పడుతూ డర్టీ బ్యూటీ



చిలసౌ.. హిట్.. డర్టీ హరి సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ముద్దుగుమ్మ రుహాని శర్మ. ఇప్పటి వరకు ఈ అమ్మడు ఏ సినిమాలో కూడా స్కిన్ షో చేయలేదు. కొన్ని సినిమాల్లో కాస్త రొమాంటిక్ గా నటించినా కూడా ఈమె స్కిన్ షో విషయంలో దూరంగా ఉంటుందా అనిపించేలా ప్రతి సినిమాలో కూడా ఆమె ధరించిన కాస్ట్యూమ్స్ ఉన్నాయి. చిలసౌ పద్దతైన ఒక మధ్యతరగతి అమ్మాయి కనుక అందులో స్కిన్ షో కి స్కోప్ లేదు.. హిట్ లో కూడా అదే తరహ పాత్ర.. ఇక డర్టీ హరి సినిమాలో టైటిల్ డర్టీ గా ఉన్నా.. సినిమా మొత్తం డర్టీ గా ఉన్నా ఈమె పాత్ర మాత్రం చాలా నీట్ గా పద్దతిగా ఉంటుంది. కనుక రుహాని కి ఆ తరహా పాత్రలే ఎక్కువగా వస్తున్నాయి. అవకాశం ఇవ్వాలే కానీ... అవసరం రావాలే కానీ తాను స్కిన్ షో విషయంలో తక్కువేం కాదు అంటూ ఇటీవల ఇన్ స్టా లో షేర్ చేసిన ఫోటోలను చూస్తే అర్థం అవుతుంది. అందాల ముద్దుగుమ్మ స్కిన్ షో చేయడంతో పాటు ఇటీ చీర కట్టులో కూడా చాలా అందంగా ఉంటుంది అంటూ ఈ ఫోటో ను చూస్తుంటే అనిపిస్తుంది. కనిపించి కనిపించకుండా క్లీ వేజ్ షో చేస్తూ చీర కట్టు లో ఇలా ముసి ముసిగా నవ్వుతూ సిగ్గు పడుతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన రుహాని శర్మ ని చూస్తుంటే గుండె జారి గల్లంతవుతుంది అంటూ చాలా మంది అబ్బాయిలు ఇలాంటి అమ్మాయి పెళ్లాంగా వస్తే ఎంత బాగుంటుందని అనుకుంటున్నారట. ప్రస్తుతం మీట్ క్యూట్ అనే సినిమాలో నటిస్తున్న ఈమె ఆగ్ర అనే హిందీ సినిమాలో కూడా నటిస్తోంది.

# మనోహరి దెబ్బకు కంటికి కునుకు కరువే

బాహుబలి మనోహరిగా నోరా ఫతేహికి ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. బాలీవుడ్ లో ఐటమ్ గాళ్ గా నర్తిస్తూనే కొన్ని ప్రధానపాత్రలు పోషిస్తూ తన ఉనికిని చాటుకుంటోంది. ఇక ఆల్ రౌండర్ డ్యాన్సింగ్ క్వీన్ గా బుల్లితెరను ఈ భామ ఏల్తోంది. డ్యాన్స్ రియాలిటీ షోలకు నోరా జడ్జిగా వ్యవహరిస్తూ వేదికను హీటెక్కిస్తోంది. ఈ మొరాకో బ్యూటీ అందచందాలు డ్యాన్సింగ్ ప్రతిభకు టీఆర్పీలు పరుగులు పెడుతున్నాయి. ఇక సోషల్ మీడియాల్లో నిరంతరం యువతరానికి కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటివ్వడంలో నోరా మాస్టర్ డిగ్రీలెన్నో పూర్తి చేసింది. తాజా ఈవెంట్లో నోరా ఫతేహి తన హాటెస్ట్ కటౌట్ తో మెరుపులు మెరిపించింది. పసుపు రంగు బాడీ–ఫిట్టింగ్ గౌనులో ఒంపుసొంపుల యవ్వనాన్ని ప్రదర్శించింది అయితే దీనికి నెటిజనులు వెంటనే స్పందిస్తూ..సిలికాన్ సిలికాన్ అందాల వల! అంటూ ట్రోల్ చేస్తున్నారు. నోరా ఫతేహికి షో స్టాపర్ గా నిలవడం ఎలానో క్లారిటీగా తెలుసు . బోయ్స్ కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటివ్వడం వెన్నతో పెట్టిన విద్య. ఇటీవల సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి థ్యాంక్స్ గాడ్ పాట 'మణికే...'లో మెరుపులు మెరిపించింది. ఈ జంట అద్భుతమైన కెమిస్ట్రీ మంటలు పుట్టించింది. నిన్న రాత్రి ఒక అవార్డ్ ఫంక్షన్ లో నోరా కనిపించిన తీరు మతులు చెడగొట్టింది. ఆరడుగుల ఆ కటౌట్ అగ్గి రాజేసింది. ప్రఖ్యాత బెస్ట్ డ్రెస్డ్ 2022 అవార్డులు ముంబైలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలో అందాల తారకలు మెరుపులు మెరిపించారు. అందరిలో నోర కేంద్రక ఆకర్షణగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. ఈషా గుప్తా– చిత్రాంగద సింగ్– అలయ ఎఫ్– రోహిత్ సరాఫ్– పూజా హెగ్డే– రియా చక్రవర్తి సహా అందగత్తెలు అత్యుత్తమ ఫ్యాషన్ తో అలరించారు. నోరా ఫతేహి పసుపు రంగు థై స్లిట్ దుస్తుల్లో అందాలను ఆరబోసింది. ఒంపుసొంపులను వడ్డించేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టని డిజైనర్ లుక్ తో మతులు చెదరగొట్టింది. ఝలక్ దిఖ్లా జా జడ్జి గా



ఈ సూపర్ లుక్ పై నెటిజన్లు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. చాలామంది ఆమెను ఉర్ఫీ జావేద్తో పోల్చారు. వీడియోపై వ్యాఖ్యానిస్తూ ఒక నెటిజను ఇస్కీ భీ ఆదర్శ ఉర్ఫీ హై ఎల్జితా హై అని రాశారు. మరొకరు సుకేష్ చంద్రశేఖర్ వివాదంపై స్పందించి "జైల్ వాలే భయ్యా కా పైసా కహా హై" అని రాశారు. "ప్రతిచోటా సిలికాన్ సిలికాన్" అని మరొకరు వ్యాఖ్యానించారు. "సబ్ ఉర్ఫీ కె కడమో పే చల్ రహే హే.. చియా" అని ఒక వ్యాఖ్య మీనింగ్. "యే సబ్ సెలబ్రిటీ పాగల్ హెూ గై హై పైసే కె లియే కుచ్ భీ కరేంగి కుచ్ భీ పెహ్నేగీ సబ్ ఏక్ జైసీ బాలీవుడ్ మే" అని ఒక ట్రోలర్ వ్యాఖ్యానించాడు.

# సమంత ఫ్యాన్స్ ని ఊరించి ఉసూరుమనిపించారు


సమంత ప్రధాన పాత్రలో గుణశేఖర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న శాకుంతలం సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సమంత అభిమానులు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు కూడా శాకుంతలం సినిమా కోసం వెయిట్ చేస్తున్న సమయంలో విడుదల తేదీ పై క్లారిటీ ఇవ్వక పోడంతో దర్శక నిర్మాత గుణశేఖర్ పై తీవ్ర విమర్శలు వచ్చిన విషయం తెల్సిందే. షూటింగ్ పూర్తి అయ్యి చాలా నెలలు అవుతున్నా కూడా ఇంకా సినిమా విడుదల తేదీని ప్రకటించక పోవడం ఏంటీ.. అసలు సినిమా ఉందా.. ఔట్ పుట్ సరిగా రాలేదని వదిలేశారా అంటూ సమంత అభిమానులు రకరకాలుగా కామెంట్స్ చేశారు. ఫ్యాన్స్



ఒత్తిడి కారణమో లేదా మరేంటో కానీ సినిమా యొక్క విడుదల తేదీని ఇటీవలే గుణశేఖర్ టీమ్ ప్రకటించిన విషయం తెల్సిందే. నవంబర్ 4వ తారీకున సినిమాను విడుదల చేయబతోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన రావడంతో అభిమానులు సంతోషించారు. మరీ ఇంత తక్కువ గ్యాప్ తో విడుదల తేదీని ప్రకటిస్తారని అనుకోలేదు అంటూ గుణశేఖర్ కి కృతజ్ఞతలు కూడా చెప్పారు. సమంత అభిమానులు ఆనందంతో కౌంట్ డౌన్ కూడా మొదలు పెట్టారు. ఆ తేదీన రావాలనుకున్న ఇతర సినిమాలు వాయిదా పడ్డాయి.




# మృణాల్ హాట్ కంటెంట్ పెంచేస్తోందిగా..



దుల్కార్–మృణాల్ ఠాకూర్– రష్మిక మందన ప్రధాన తారాగణంగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన పీరియాడికల్ రొమాంటిక్ డ్రామా 'సీతారామం' ఆగస్ట్ 5న తెలుగు– తమిళం– మలయాళ భాషల్లో విడుదలై బాక్సాఫీస్ వద్ద పెద్ద సక్సెసైన సంగతి తెలిసిందే. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గదా సమర్పణలో ఈ చిత్రం హిందీలో సెప్టెంబర్ 2న సినిమా థియేటర్లలో విడుదలైంది. అక్కడా చక్కని ఆదరణ దక్కించుకుంది. హిందీ పరిశ్రమకు సుపరిచితురాలైన అందాల కథానాయిక మృణాల్ ఠాకూర్ తనవంతు ప్రచారం తో అభిమానులకు మరింత చేరువైంది. నేను దక్షిణాది సినిమాల్లో ఇంతకంటే మంచి అరంగేట్రాన్ని కోరుకోను.. నేను పొందుతున్న ప్రేమ అపురూపమైనదని మృణాల్ ఇంతకుముందే ఆనందం వ్యక్తం చేసింది. హను రాఘవపూడి దర్శకత్వం వహించిన ఈ పీరియాడికల్ రొమాంటిక్ డ్రామా కథాంశం ఆసక్తికరం. ఈ మూవీ కథ దేశభక్తి చుట్టూ తిరుగుతుంది. ఇందులో దుల్కార్ సల్మాన్ అందమైన హంక్ ఆర్మీ ఆఫీసర్ గా నటించాడు. ఈ సినిమాలో దుల్కర్.. మృణాల్ నటనకు ప్రశంసలు తతదక్కాయి. యుద్ధం సరిహద్దులు మతం కంటే మానవత్వమే ముఖ్యమన్న వాస్తవాన్ని హను తెరపై ఎంతో హృద్యంగా అందంగా చూపించారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ సినిమా చేరువైంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com